క్లుప్తంగా

నిర్మాణదారులకు నోటీసులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్, ప్రగతినగర్‌లో అపార్ట్‌మెంట్ కూప్పకూలిన ఘటనపై హెచ్ఎండీఏ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రగతినగర్‌లో సర్వే నెంబరు 146 పార్ట్‌లో ప్లాట్ నెంబర్ 64, 65లలో శ్రీసాయి కన్‌స్ట్రక్షన్స్ పేరిట నిర్మిస్తున్న ఐదంతులు అపార్ట్‌మెంట్ ఇటీవల కుప్పకూలింది. దీనిని తీవ్రంగా పరిగణించి హెచ్ఎండీఏ కమిషనర్ శనివారం నిర్మాణదారులు శంకర్‌రెడ్డి, మధుసూదన్‌రాజు లకు నోటీసులు జారీ చేశారు. భవన నిర్మాణ అనుమతి ఎందుకు రద్దు చేయకూడదో నోటీసులు అందిన మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, అదే విధంగా భవన నిర్మాణానికి సంబంధించి అర్కిటెక్ట్, ఇంజినీర్ దీపక్‌కుమార్‌కు సైతం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శ్రీసాయి కన్‌స్ట్రక్షన్స్ పేరిట నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఎలాంటి విక్రయ లావాదేవీలను అంగీకరించవద్దని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బాలానగర్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. శనివారం బాలానగర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ మానికకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఆశావర్కర్లు పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్నా వారికి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఆశా వర్కర్లకు కనీసం వేతనం రూ.18 వేలు ఇవ్వాలని,పీఎఫ్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా రూ. ఐదు లక్షలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ. ఐదు లక్షలు, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశా వర్కర్లకు అవకాశాలు కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు 25నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు అనిత, సబియా, మౌనిక, జగదీశ్వరి, లక్ష్మి, నాగమణి, స్వాతి, అశ్విని, భాషమ్మ, సుశీల, సరళ, వినోద, కనకమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అంతర్జాతీయ దినోత్సవ పోటీలు

గచ్చిబౌలి: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈపీటీఆర్ఐ)లో ఓజోన్ పొర పరిరక్షణకు అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్ వంటి పోటీలను నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం డైరెక్టర్ జనరల్ వాణీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆసిఫ్ ఖురేషీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి రాజారావు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు తదితరులు ప్రసంగించారు.

రాయదుర్గంలో పీస్ కమిటీ సమావేశం

గచ్చిబౌలి: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మహేష్ మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు, నిమజ్జనం వరకు జరిగే కార్యక్రమాలన్నీ ప్రశాంతంగా సాగేలా అందరూ సహకరించాలని కోరారు.

పచ్చదనంతోనే వాతావరణ సమతుల్యత

శేరిలింగంపల్లి: సృష్టిలోని సకల జీవరాసుల మనుగడకు వాతావరణ సమతుల్యను సాధించడానికి పచ్చదనాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ ఎట్మాస్ఫియర్ సైన్సెస్ ప్రొఫెసర్ కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో లింగంపల్లి హైస్కూల్‌లో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్‌ను వినియోగించడంతో పాటు రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను , శబ్ద, వాయు కాలుష్యాలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

యశోద హాస్పిటల్‌లో సింపోజియం స్పోర్ట్స్ మెడ్

మాదాపూర్: మాదాపూర్‌లోని యశోధ హస్పిటల్‌లో హైటెక్‌సిటీ టోనాబోలిక్ ఫిట్‌నెస్ టీమ్‌తో కలసి శనివారం సింపోజియం స్పోర్ట్స్ మెడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ సంగీత స్వరకర్త ఎంఎం కీరవాణీ హాజరై ప్రారంభించారు.

మట్టి వినాయకుడికి జై కొడదాం..

జీడిమెట్ల: వినాయక చవితి పండగను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్లలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. పండగకు ఒకరోజు ముందు ఆదివారం సెలవు ఉండటంతో ముందుగానే పలు స్కూళ్లలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పలు కాలనీలు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సైతం విగ్రహాలు పంపిణీ చేశారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థులకు విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో జోనల్ కమిషనర్ మమత పాల్గొన్నారు.



నందానగర్ కృష్ణవేణి స్కూల్‌లో..


సూరారం నార్త్‌సిటీ పాఠశాలలో..


కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో..



జీడిమెట్ల జేఏఏ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో..



అపురూప కాలనీలో..


జగద్గిరిగుట్ట వార్డ్ కార్యాలయంలో..


వెంకటేశ్వరనగర్ బచ్‌పన్ స్కూల్‌లో..

పండగ సందడి షురూ..


చిట్టి బొజ్జ గణపయ్యలు..
భగవాన్‌సింగ్

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో వినాయక చవితి పండగ సందడి మొదలైంది.. ప్రధాన చౌరస్తాల్లో ఇప్పటికే గణనాథుల విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి.. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా పరిసరాల్లోని హెచ్ఎంటి రోడ్డు, చింతల్ రహదారులకు ఇరువైపులా భారీ ఎత్తున విగ్రహాలను అమ్మకానికి ఉంచారు. ఒక్కో విగ్రహాన్ని ఎత్తున బట్టి రూ.400 మొదలు రూ.45 వేల వరకు ధర పలుకుతున్నాయి.. వినాయక మండప నిర్వాహకులు కొనుగోలు చేసిన గణనాథుడి విగ్రహాలను డప్పు చప్పుళ్ల మధ్య ఆటోల్లో తరలిస్తున్నారు. దీంతో కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా, సుచిత్ర, జీడిమెట్ల గ్రామం, గండిమైసమ్మ చౌరస్తా తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది..

పెద్ద అంబర్‌పేట్‌లో తయారీ..

వినాయక విగ్రహాలను నెల రోజులుగా పెద్ద అంబర్‌పేట్, గండిమైసమ్మ ప్రాంతాల్లో తయారు చేయించి ఇక్కడ విక్రయిస్తున్నాం. విగ్రహ సైజును బట్టి 5 అడుగుల విగ్రహాన్ని రూ.6వేలు, 10 నుండి 12 అడుగులు ఆపై విగ్రహాలను రూ.25వేల మొదలు రూ. 45 వేల వరకు విక్రయిస్తున్నాం.

– భగవాన్‌సింగ్, విక్రయదారుడు, ఎల్లమ్మబండ


కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో అమ్మకానికి ఉంచిన గణనాథుల విగ్రహాలు


గణనాథుడుడి చేతిలో బాలకృష్ణుడు..

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

కుత్బుల్లాపూర్: మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో రూ.14 లక్షలు, బీరప్పనగర్‌లో రూ.16లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీని అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షుడు రుద్రా అశోక్, కుంట సిద్ధి రాములు, గుమ్మడి మధుసూదన్, సంపత్ మాధవ్ రెడ్డి, సమ్మయ్య నేత, యేసు, కాలనీ వాసులు పెద్ది మల్లేష్, మురళి గౌడ్, కుంట వేణు తదితరులు పాల్గొన్నారు.

◆ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ సాయిబాబా ఆలయం నుంచి 100 కార్లతో ర్యాలీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి.


ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ప్రమాదకరంగా నాలా ప్రహరీ

జగద్గిరిగుట్ట: ఇటీవల కరిసిన వర్షాలకు చింతల్, గణేష్‌నగర్ నాలా పొంగి కాలనీలు జలమయమయ్యాయి. ఆ సమయంలో ప్రత్యామ్నాయంగా నాలా ప్రహరీని కూల్చివేసిన అధికారులు ఆ తర్వాత దానిని పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రమాదకరంగా ఉన్న నాలా ప్రహరీ..

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని సర్వే నెంబర్ 143, 144లోని తెలుగు యూనివర్సిటీకి వెళ్లే రోడ్డులోని ప్రభుత్వ భూమిలో స్పీడ్ విద్యుత్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ వ్యక్తి ప్రహరీని నిర్మించి బోర్డును ఏర్పాటు చేయడంపై శనివారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సదరు స్థలంలో నర్సరీతో ఏర్పాటు చేశారని, అదే విధంగా హెచ్ఎండబ్ల్యూఎస్‌కు చెందిన పైప్‌లైన్, ఈ స్థలం మీదుగానే వెళ్తోందన్నారు. ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ సంస్థకు చెందిన బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.


మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అవమానిస్తోందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి అన్నారు. ఈ నెల 17న తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ శనివారం గాజులరామారంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ విమోచనంలో ప్రాణాలర్పించిన యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, మజ్లిస్ ఒత్తిడితోనే సీఎం కేసీఆర్ వెనుకడుగు వేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సాయినాథ్ నేత, బీజేవైఎం స్టేట్ సెక్రటరీ రేవతి రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు రాజారెడ్డి,డివిజన్ జెనరల్ సెక్రటరీ జ్ఞానీ, మధు,గంగారాం తదితరులు పాల్గొన్నారు.

'విజయ భేరి'ని విజయవంతం చేయాలి

జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించనున్న విజయభేరి సభను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య అన్నారు. ఈ నేపథ్యంలో జగద్గిరిగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు ర్యాలీ నిర్వహించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన నాయకులను బుద్ధి చెప్పడానికి విజయభేరి సభ నాంది కావాలన్నారు. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వరమ్మ, సాయి ప్రవీన్, మురళి, కార్తిక్, రవీందర్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

డీకే శివకుమార్‌కు సత్కారం


కర్నాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌ను సత్కరిస్తున్న నర్సారెడ్డి భూపతి రెడ్డి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో పైప్‌లైన్ రోడ్డులో ఉన్న ఎస్‌సీటీపీ (సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌పోర్ట్ పాయింట్) ని కర్నాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ శనివారం సందర్శించారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న ఈ ప్లాంట్‌లో చెత్తను ఏ విధంగా రీ సైక్లింగ్ చేస్తారు, వాటికి ఉపయోగించే అత్యాధునిక పరికరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌తో పాటు పలు ఎస్‌సీటీపీ ప్లాంట్‌లను సందర్శనలో భాగంగా ఆయన జగద్గిరిగుట్ట ప్లాంట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి శాలువాతో సత్కరించారు.

వ్యక్తిగత ప్రయోజనాలతోనే బదిలీలకు అడ్డంకులు

చింతల్: వ్యక్తిగత ప్రయోజనాలతోనే కొందరు ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌కు ఆటంకాలు సృష్టిస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పదోన్నతులు, బదిలీల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులకు షెడ్యూలల్ ప్రారంభమైందని, అయితే కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వచ్చే ఎన్నికలను సాకుగా చూపుతూ కోర్టు ఉత్తర్వుల ద్వారా ప్రస్తుత బదిలీల నుంచి మినహాయింపు పొందారన్నారు. ఇదే తరహాలో మరి కొందరు కోర్టు బాట పట్టే ప్రమాదం ఉందని, ఇది బదిలీల షెడ్యూల్ పై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందన్నారు.

కారు షెడ్డు పైనుంచి పడి వృద్ధుడి మృతి

కుత్బుల్లాపూర్: కారు పార్కింగ్ షెడ్డు పైనుంచి కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సూర్యనారాయణ(61), ఈశ్వరి దంపతులు బతుకు దెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి పేట్‌బషీరాబాద్‌లోని కాంటన్ పార్కులోని విల్లా నెంబరు 16లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ అక్కడే ఉంటున్నారు. శనివారం విల్లాలోని కారు షెడ్డుపై దుమ్మును తొలగించేందుకు పైకి ఎక్కిన సూర్యనారాయణ ప్రమాదశాత్తు కాలుజారి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

ఆల్విన్‌కాలనీ: మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు అన్నారు. శనివారం మార్పు కోసం పాదయాత్ర ఆల్విన్‌కాలనీ డివిజన్ జలకన్య హోటల్ నుంచి తులసినగర్, శ్రీ తులసి నగర్, భూదేవి హిల్స్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. 24 గంటలు ఉచిత విద్యుత్ అమలుకు నోచుకోవటం లేదన్నారు. కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

మూసాపేట: కూకట్‌పల్లి ఎన్‌ఆర్‌సి గార్డెన్‌లో శనివారం భారత్ వికాస్ పరిషత్ కూకట్‌పల్లి సుభాష్ చంద్రబోస్ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ సాంగ్స్ పోటీలు నిర్వహించారు. హిందీ, తెలుగు, సంస్కృతం, జానపద, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. 39 పాఠశాలల విద్యార్థులు, 190 గ్రూప్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. హిందీలో మొదటి బహుమతి వికాస్ కాన్సెప్ట్ స్కూల్, ద్వితీయ బహుమతి పీఎస్ఎం స్కూల్, 3వ బహుమతి సరస్వతి శిశుమందిర్, సంస్కృతంలో మొదటి బహుమతి వికాస్ కాన్సెప్ట్ స్కూల్, ద్వితీయ బహుమతి పిఎస్ఎం స్కూల్, తృతీయ బహుమతి పంచశీల స్కూల్ విద్యార్థులు అందుకున్నారు. అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఎస్‌సి కన్వీనర్ శివరాత్రి యాదగిరి, జలవేందర్ రావు, కార్యక్రమం నిర్వాహక కార్యదర్శి పంచశీల శ్రీనివాస్, కోశాధికారి పి. సుకృత్ కుమార్, ఉపాధ్యక్షులు బీఎస్ఎన్ మూర్తి, సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన

సుభాష్‌నగర్: జాతీయ పోషణ వారోత్సవాల్లో భాగంగా శనివారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని దూలపల్లి–1 అంగన్‌వాడీ కేంద్రంలో చిరు ధ్యానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందన చిరు ధాన్యాలు తీసుకోవడం కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి



జగద్గిరిగుట్ట: నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందని ద్రాక్షగానే మిగిలి పోతాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట బస్టాప్‌లోని భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తమకు డబుల్ బెడ్‌రూం గృహాలు అందుతాయని ఎంతో ఆశగా ఎదురు చూశారని, అయితే ఇటీవల విడుదల చేసిన జాబితాలో ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదన్నారు. దళిత బంధు,బీసీ బంధు పథకాల్లోనూ వారికి అన్యాయం జరిగిందన్నారు. డబుల్ బెడ్ ఇల్లు రాని వారిని సంఘటితం చేసి వారి పోరాటం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులతో పాటు హరినాథ్, రాములు, శ్రీనివాస్, సామేల్, యాదగిరి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్‌ల పంపిణీ

సుభాష్‌నగర్: గాజులరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన తన సోదరుడు కూన శ్రీశైలంగౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యే అయ్యారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు కేకేఎం ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్తారమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్య గౌడ్, జనరల్ సెక్రటరీ బాలరాజు, బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, సాయినాథ్ నేత, రేవతి రెడ్డి, రాజిరెడ్డి, యాము, వర్మ, జ్ఞానీ, టైసన్, మురళి, నరేందర్ రెడ్డి, గంగారాం, లక్ష్మణ్, జహంగీర్, శ్రీనివాస్, యశ్వంత్, రమేష్, గిరి, ఆంజనేయులు, ట్రస్ట్ వాలంటీర్లు పాల్గొన్నారు.


విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్